చేపల ధరలకు రెక్కలు

• మృగశిర కార్తె ప్రభావం • జిల్లా వ్యాప్తంగా పండుగ సందడి • రైతులు ప్రత్యేక పూజలు

బొంరాస్‌పేట: చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

వికారాబాద్/బొంరాస్ పేట, జూన్ 8: మృగశిర కార్తె పండుగను ఆదివారం వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ఈ పండుగ రోజు చేపలు తినడం ప్రత్యేకత. దీంతో చేపల ధరలకు రెక్కలు వచ్చాయి. బొంరాస్‌పేట మండలం తుంకిమెట్ల గ్రామంలో ఉన్న మార్కెట్లో చేపల కొనుగోలు కోసం ప్రజలు ఎగబడ్డారు.దీంతో అమ్మకందారులు కిలో చేపలు మామూలు సమయంలో రూ.150 ఉండగా ఆదివారం మాత్రం రూ.200 నుంచి రూ.300 వరకు అమ్మారు. మరోవైపు మృగశిరకార్తెలో వర్షాలు కురవ డంతో రైతులు సాగు పనుల్లో నిమగ్నం అవుతారు. విత్తనాలు వేయడం, వరి నార్లు పోసుకోవడం వంటి పనుల్లో ఊపిరి సలపకుండా ఉంటారు. మృగశిర కార్తె ఆగమనం రోజు చాలామంది రైతులు ప్రత్యేక పూజలు చేస్తారు. తమ కుల దైవాలకు పూజలు చేసి.. పంటలు మెండు గా పండాలని.. ఎటు వంటి ఆటంకాలు రాకుండా ఉండాలని కుల దైవాలకు పూజలు చేస్తారు. చేపలతో వంటలు వండి నైవేద్యంగా పెడుతుంటారు. మృగశిర కార్తె ఆగమనం రోజు చేపలు తింటే అదృష్టం కలుగుతుందని చాలా మంది నమ్ముతుంటారు. చేపలు ఆరగించని వారు బెల్లంలో కాస్త ఇంగువ కలిపి.. ఉండలు లాగా చేసుకుని తింటారు. కార్తె ఆగ మనం రోజు మాంసాహార ప్రియులు చేపలను ఆహారంగా తీసుకుం టారు. రోగ నిరోధక శక్తిని అందించడానికి చేపలు ఎంతగానో ఉపయోగ పడతాయి. వర్షాకాలంలో సోకే జ్వరం, జలుబు, శ్వాస కోశ వ్యాధుల నుంచి చేపలు రక్షిస్తాయి. చేపల్లో ఒమేగా –3ఫ్యాటీ యాసిడ్, ప్రోటీన్లు రోగానికి శక్తిని పెంపొందిస్తాయి. అందువల్లే రోహిణి కార్తె ముగిసిన తర్వాత.. మృగశిరకార్తె ప్రారంభమైన రోజు చేపలను తినడం ఆనవాయితీగా వస్తోంది.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 362 మంది పట్టివేత

సిటీబ్యూరో, జూన్ 8(నమస్తే తెలంగాణ): రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో భాగంలో సైబరాబాద్ పోలీసులు శనివారం రాత్రి స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. కమిషనరేట్ పరిధిలోని 10 హాట్ స్పాట్‌లు సహా ఓఆర్ఆర్ పరిసర ప్రాంతాల్లో భారికేడ్లు ఏర్పాటు చేసి, వాహనాల తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 362 మంది మందుబాబులు వాహనాలు నడుపుతూ పట్టుపడ్డారు. 260 మంది ద్విచక్రవాహనదారులు, 24 మంది త్రిచక్రవాహనదారులు, 73 మంది నాలుగు చక్రాల వాహనదారులు, ఐదుగురు భారీ వాహనదారులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన నిందితులందరిని న్యాయస్థానంలో హాజరు పరిచినట్లు పోలీసులు వెల్లడించారు. ఇదిలా ఉండగా మద్యం మత్తులో వాహనాలు నడపడం నేర మని, ఈ చర్య వల్ల రోడ్డు ప్రమాదంతో పాటు ఎవరి మృతికైన కారణమైతే భార తీయ న్యాయ సహిత చట్టం 2023, సెక్షన్ 105 ప్రకారం హత్యా నేరం కేసు నమోదు చేయడంతో పాటు 10 ఏండ్ల వరకు జైలు శిక్ష పడేఅవకాశమున్నట్లు పోలీసులు హెచ్చరిస్తున్నారు.

చదువుకు అంగవైకల్యం అడ్డు కాదు



లగచర్ల బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

బొంరాస్ పేట, జూన్ 8: దుద్యాల మండల పరిధిలోని లగచర్ల గ్రామంలో మూడోరోజు బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు నిర్వహించారు. చదువుకు అంగవైకల్యం అడ్డు కాదని అమ్మాయి అంగవైకల్యం కలిగి ఉండి చదువుకు దూరం అవుతున్న సందర్భంగా అమ్మాయికి మనోధైర్యాన్ని కల్పించి ఉన్నత పాఠశాల దుద్యాలకు పంపియాలన్నారు.అమ్మాయి వచ్చి పోవడానికి సీడబ్ల్యూఎస్ ద్వారా ట్రై సైకిల్ అందించే విధంగా ప్రయత్నం చేస్తామని తల్లిదండ్రులకు వివరించారు. ఉన్నత లక్ష్యాలకు అనుగుణంగా విద్యాబోధన కేవలం ప్రభుత్వ బడులలో మాత్రమే సాధ్యమన్నారు.ప్రతి బడీఈడు పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలందరినీ ప్రభుత్వ బడులలో చేర్పించే విధంగా ప్రయత్నం చేయాలన్నారు. ప్రభుత్వ బడుల్లో సుశిక్షితులైన ఉపాధ్యాయులతో విద్యా బోధన జరుగుతున్నదన్నారు. దుద్యాల ఉన్నత పాఠశాలకు ఆధీన గ్రామమైన లగచర్ల గ్రామంలో ప్రైవేటు బడులకు పోయే, సీఎస్ డబ్ల్యూ , బడి మానేసిన, బడి బయట పిల్లల ఇంటింటి సందర్శన ద్వారా గుర్తించి వారి వివరాలను అన్నింటిని నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. మీ పిల్లలందరినీ దుద్యాల పాఠశాలలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఉచితంగా విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్ గౌడ్, అభయకుమార్, రాములు, రవి నాయక్ పాల్గొన్నారు.

కులకచర్ల : బడిబాట కార్యక్రమంలో భాగంగా పుట్టపహాడ్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం సభ్యులు పాఠశాలలో విద్యార్థుల చేర్పించుకొనుటకు ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో బడిఈడు పిల్లల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలలోనే తమ పిల్లలను చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను తల్లిదండ్రులకు వివరించడంతో పాటు గత విద్యా సంవత్సరం పదవ తరగతిలో తమ విద్యార్థులు సాధించిన ప్రగతిని కరపత్రాల ద్వారా గ్రామస్థులకు విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ఈ ప్రచారానికి గ్రామస్థులు, తల్లిదండ్రుల నుండి విశేష స్పందన లభించిందని, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పిస్తామని వారు ఉపాధ్యాయులకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అజ్మతుల్లా, ఉపాధ్యాయులు ఆంజనేయులు, కృష్ణయ్య,అజ్మత్, రమేష్, వేణయ్య, సాయికుమార్, మహేశ్, మాణిక్యం, రామచంద్రయ్య, కల్పన, భాగ్యమ్మ పాల్గొన్నారు.

పుట్టపహాడ్‌లో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

కులకచర్ల(పరిగి), జూన్ 8 : పరిగి మండల పరిధిలోని రంగాపూర్‌లో శ్రీ సత్యసాయి సేవా కేంద్రం సోలిపేట బ్రదర్స్ వారి ఆధ్వర్యంలో 50మంది విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ పొందిన విద్యార్థులకు, కంప్యూటర్ విద్యార్థులకు బాలవికాసం విద్యార్థులకు ముగింపు సమావేశం నిర్వహించి విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు. నోటు పుస్తాకాలతో పాటు సత్యసాయి ఫోటోలను అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవాల కేంద్రం నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బొంరాస్ పేట, జూన్ 8 :మండల పరిధిలోని 43 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 5వేల 1వంద 30 నోట్ బుక్స్ వివిధ పాఠశాలల హెచ్ఎంలకు పంపిణీ చేసినట్లు విద్యా అధికారి హరిలాల్ తెలిపారు.

ఇసుక డంపులు స్వాధీనం

యాలాల జూన్ 8: : ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను ఆర్ఐ వేణు, రెవెన్యూ, పోలీస్ అధికారులతో కలిసి ఎస్‌హెచ్‌వో గిరి ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. యాలాల్ మండలం కోకట్ శివారులోని వైష్ణవి మోటర్ వెనుక ఇసుక డంపులను సీజ్ చేసినట్లు ఎస్ హెచ్‌వో గిరి పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్కూటీ, లారీ ఢీ.. యువకుడి మృతి

జీడిమెట్ల, జూన్ 8 : స్కూటీని లారీ ఢీకొట్టిన ఘటనలో యువకుడు మృతి చెందగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్ పాండు బస్తీకి చెందిన రంగంపేట వినయ్ (18) ఐదేళ్ల బాలుడిగా ఉన్నప్పుడే తండ్రి ప్రసాద్ మృతి చెందాడు. వినయ్ తల్లి మని వినయ్‌తో పాటు అతడి చెల్లిని కష్టపడి చదివిస్తూ పోషిస్తుంది. ఇటీవలే వినయ్ ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేశాడు. 15 రోజుల క్రితం టీజీఐఐసీ కాలనీలోని జేవీసీ పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం విష్ణు అనే వ్యక్తితో కలసి ట్యాంక్ బండ్ కు వెళ్దామని స్కూటీపై సాయిబాబానగర్ నుంచి బయలుదేరారు. స్కూటీని వినయ్ నడుపుతుండగా విష్ణు వెనకాల కూర్చున్నారు. వీరిద్దరు జీడిమెట్ల లోని లక్సాయ్ పరిశ్రమ వద్దకు చేరుకోగానే హనుమాన్ టెంపుల్ వద్ద వేగంగా యూటర్న్ తీసుకుంటున్న లారీ వీరు ప్రయాణిస్తున్న స్కూటీని ఢీ కొట్టింది. వినయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. విష్ణుకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వికారాబాద్, జూన్ 8: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం వికారాబాద్ పట్టణంలోని శ్రీ వివేకవాణి విద్యాలయంలో ఘనంగా జరిగింది. 1999–2000 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు చదువుకుని 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభతరుణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలు కప్పి జ్ఞాపికలు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల స్థాయి విషయాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ నాగ య్య ఉపా ధ్యాయులు వెంకటేశం, సల్మాన్‌రాజ్, నర్సమ్మ, మాణెమ్మ, అనుసూయ పాల్గొన్నారు.

గోవధకు యత్నం..

కులకచర్ల, జూన్ 8: చౌడాపూర్ మండల కేంద్రంలో ఆదివారం గోవధ చేయడానికి ప్రయత్నిస్తున్న విషయాన్ని గ్రామానికి చెందిన యువకులు కులకచర్ల పోలీసులకు సమాచారం అందించారు. గ్రామ సమీపం లో పొలంలో ఒక ఎద్దు కాళ్లు కట్టేసి ఉన్న విషయాన్ని తెలుసుకున్న యువకులు అక్కడకు చేరుకొని నిలువరించడంతో పాటు విషయాన్ని కులకచర్ల పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ రమేశ్ ఆధ్వర్యంలో అక్కడికి చేరు కొని ఎద్దును అక్కడి నుండి తర లించి సం బంధించిన యజమానికి అప్పగించినట్లు తెలిపారు.

టాపర్స్‌కు సన్మానం

బొంరాస్ పేట, జూన్ 8 : బొంరాస్ పేట మండల వ్యాప్తంగా 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి– 2025 లో మండల స్థాయిలో టాపర్స్ గా నిలిచిన 16 మంది విద్యార్థులను సన్మానించనున్నట్లు మండల విద్యాధికారి హరిలాల్ తెలిపారు. కేజీబీవీ చెట్టుపల్లి తండా, జడ్పీహెచ్ఎస్ చౌదర్‌పల్లి, బొట్లవాని తండా ఆశ్రమ పాఠశాల, బొంరాస్ పేట, రేగడి మైలారం ఉన్నత పాఠ శాలకు చెందిన విద్యార్థులను బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సన్మానం ఉంటుందన్నారు

కరెంట్ కోతలతో తిప్పలు

పెద్దేముల్, జూన్ 8 : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ప్రతీ రోజు పలు మార్లు గంటలకొద్ది కరెంటు కోతలు విదిస్తున్నారు, దీంతో జనాలు విసిగి పోతున్నారు, వాతా వరణంలో మార్పుల కారణంగా ఉక్క పోత తో జనాలు ఇబ్బందులు పడక తప్ప డం లేదు. కాంగ్రెస్ వస్తే కరెంటు పోతది అన్న నాణుడి నిజమైంది అని ప్రజలు మాట్లాడుకుంటున్నారు.

ఆశ్రయం కల్పిస్తానని లైంగికదాడికి యత్నం

బంజారాహిల్స్,జూన్ 8: ఒంటరిగా రోడ్డుమీద నిలబడిన యువతిని మాయమాటలతో నమ్మించి గదికి తీసుకువెళ్లడమే కాకుండా లైంగికదాడికి యత్నించిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మహారాష్ట్రకు చెందిన యువతికి కుటుంబసభ్యులు ఇష్టం లేని పెళ్లి నిర్ణయించారు. ఇంటినుంచి పారిపోయి వచ్చిన యువతి రైల్లో హైదరాబాద్‌కు చేరుకుంది. జూబ్లీ హిల్స్‌లోని పెద్దమ్మ గుడి బస్‌స్టాప్‌లో ఒంటరిగా నిలబడింది. అదే సమయంలో బైక్ మీద అక్కడకు వచ్చిన గుంటూరు జిల్లా పిడుగురాళ్ల ప్రాంతానికి చెందిన డ్యాన్స్ అసిస్టెంట్ మల్లికార్జున్‌రెడ్డి ఆమెకు మాయమాటలు చెప్పాడు. తాను పని కల్పిస్తానంటూ నమ్మబలికి గదికి తీసుకువెళ్లాడు. అక్కడ భోజనం పెట్టిన తర్వాత లైంగికదాడికి యత్నించాడు. యువతి కేకలు వేయడంతో స్థానికులు అక్కడకు చేరుకుని నిలదీయగా తన భార్య అంటూ నమ్మించే యత్నం చేశాడు. అనుమానం రావడంతో స్థానికులు డయల్ 100కు ఫోన్ చేశారు. బాధితురాలి ఫిర్యాదుతో మల్లికార్జున్‌రెడ్డిపై లైంగికదాడి యత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికతో ప్రేమాయణం.. యువకుడి దారుణ హత్య

మలక్ పేట జూన్ 8: రాజస్థాన్ కు చెందిన బాలిక ప్రేమాయణం విషయంలో ఇరువురి మధ్యన జరిగిన ఘర్షణలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన చాదర్‌ఘట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అక్బర్ బాగ్ డివిజన్ జడ్జెస్ కాలనీకి చెందిన కుర్దుస్ (30), దబీర్ పురాకు చిన్న ఇర్షాద్‌లతో రాజస్థాన్ కు చెందిన బాలిక ప్రేమాయణం కొనసాగిస్తుంది. ఈ విషయంలో కుర్దుస్, ఇర్షాద్ మధ్య తీవ్ర విభేదాలు నెలకొన్న నేపథ్యంలో బాలిక ఇర్షాద్ కు అండగా నిలిచింది. శనివారం రాత్రి బాలిక విషయంలో కుర్దూస్, ఇర్షాద్ లు గొడవపడగా, కోపోద్రిక్తుడైన ఇర్షాద్, కుర్దుస్ ఛాతిపై కత్తితో బలంగా పొడిచి హత్య చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

బాలికపై అసభ్య ప్రవర్తన..కేసు

వెంగళరావునగర్, జూన్ 8 : ఇంటి బయట స్నేహితురాళ్లతో కలిసి ఆడుకుంటున్న బాలికను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లిన వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఎస్ఆర్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో నివాసం ఉండే రఫు అనే వ్యక్తి పక్కింట్లో ఉండే బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని ఎవరికైనా చెప్తే చంపేస్తానని బెదిరించాడు. ఇంటికి వచ్చిన బాలికను తల్లిదండ్రులు ప్రశ్నించగా జరిగిన విషయాన్ని చెప్పింది. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నువ్వు నాతో మాట్లాడకుంటే చచ్చిపోతా..

వెంగళరావునగర్, జూన్ 8 : నువ్వు నాతో ఫోన్‌లో మాట్లాడకుంటే చచ్చిపోతానని ఇన్‌స్టాలో పరిచయమైన బాలికను ఓ యువకుడు వేధింపులకు గురిచేసిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న బాలిక ఇటీవలే పదో తరగతి పరీక్షలు రాసింది. ఒక సబ్జెక్ట్‌లో ఫెయిల్ కావడంతో ఇంటి పద్దే ఉంటుంది. ఐదు నెలల క్రితం ఇన్‌స్టాగ్రాంలో ప్రభు అనే యువకుడు బాలికను పరిచయం చేసుకున్నాడు. దీంతో తనతో ఫోన్‌లో మాట్లాడకుంటే చనిపోతానని.. ఫోన్ మాట్లాడకుంటే కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి నీ గురించి చెడుగా చెబుతానని వేధించ సాగాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు యువకుడిపై ఫోక్సో కేసు నమోదైంది.

దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్

బషీరాబాద్, జూన్ 8 : దళితులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని లేని పక్షంలో దళిత ప్రజా సంఘుల ఆధ్వర్యంలో డీఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలో దళిత సంఘాలతో సమావేశాన్ని నిర్వహించి, డీఎస్పీ కార్యాలయం ముట్టడి విషయంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండూరు మండల బేల్కటూర్ గ్రామానికి చెందిన దళిత యువకుడు వినయ్‌కుమార్ మే నెల 18న వివాహం చేసుకుని ఊరేగింపు చేస్తున్న సమయంలో కొంత మంది అగ్రవర్ణ కులస్తులు అడ్డుకుని దాడిచేసినట్లు తెలిపారు. దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలన్నారు. లేని పక్షంలో డీఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు.

భారీగా డిఫెన్స్ మద్యం పట్టివేత

రూ. 2.30 లక్షల విలువ చేసే బాటిళ్లు సీజ్

సిటీబ్యూరో, జూన్ 8 (నమస్తే తెలంగాణ): అక్రమంగా డిఫెన్స్ మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను శంషాబాద్ డీటీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. శంషాబాద్ డీటీఎఫ్ సీఐ ప్రవీణ్ కుమార్ వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ఇద్దరు వ్యక్తులు డిఫెన్స్ క్యాంటీన్ నుంచి శేరిలింగంపల్లి హఫీజ్‌పేట్ మీదుగా కారులో అక్రమంగా మద్యం బాటిల్లు తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న డీటీఎఫ్ బృందం హఫీజ్‌పేట వద్ద తనిఖీ చేయగా పెద్ద ఎత్తున డిఫెన్స్ మద్యం బయటపడింది. నిందితులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.2.30 లక్షల విలువైన 115డిఫెన్స్ మద్యం బాటిళ్లతో పాటు కారు, రెండు సెల్‌ఫోన్‌లను సీజ్ చేశారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా డీసీ దశరథ్, శంషాబాద్ ఈఎస్ కృష్ణప్రియ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ దాడుల్లో డీటీఎఫ్ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, కానిస్టేబుళ్లు గణేశ్, శేఖర్, నెహ్రూ ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

కులకచర్ల, జూన్ 8: కులకచర్ల మండల కేంద్రంలో అంగడి బజార్‌లో పలువురు ఇందిరమ్మ లబ్ధిదారుల ఇండ్లకు డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడి ముగ్గులు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసి ప్రభుత్వం నుండి అందించే సహాయాన్ని పొందాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యేవిధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సుంకిరెడ్డి కృష్ణారెడ్డి, కడుమూరి బాల్‌రెడ్డి, చెలిమిళ్ల ఆనందం, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చాకలి వెంకటేశ్, బిచ్చయ్య, గోపాల్, శివప్రసాద్, కేశవులు, అక్బర్ తదితరులు పాల్గొన్నారు

నగల కోసం వృద్ధురాలి హత్య

మణికొండ, జూన్ 8: ఓ వృద్ధురాలికి మాయమాటలు చెప్పి బంగారు నగలు దోచుకొని హత్య చేసిన ఘటన నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. నార్సింగ్ మున్సిపాలిటీ ఖానాపూర్‌కు చెందిన రామేశ్వరం బాలమ్మ (72) వృద్ధురాలు ప్రతిరోజు ఉదయం వాకింగ్‌కు వెళ్తుండేది. ఆమె ఇంటి పక్కన అద్దెకుంటున్న అనిత అనే మహిళ ఆమె ఒంటిపై ఉన్న బంగారు నగలపై కన్నేసింది. రెండు రోజుల క్రితం బాలమ్మతో సన్నిహితంగా ఉంటూ తమ సొంతూరు చేవెళ్ల మండలం చనివెల్లిలో కల్లు బాగుంటుందని చెప్పింది. వృద్ధురాలు ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయలుదేరి వెళ్లింది. ఇదే అదునుగా భావించిన అనిత వృద్ధురాలికి పీక లదాకా కల్లు తాగించి ఆమె మెడలోని బంగారు గొలుసు, వెండి ఆభరణాలను దోచుకుని నిర్మానుష ప్రాంతంలోకి తీసుకెళ్లి గొంతు కోసి హత్య చేసింది. అనుమానం రాకుండా అనిత అద్దెకు ఉండే ఖానాపూర్‌లోని ఇంటికి వచ్చేసింది. బాలమ్మ కోడలు రామేశ్వరం లక్ష్మి నార్సింగి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. అనిత పై అనుమానం వచ్చిన పోలీసులు విచారించగా తానే హత్య చేసినట్లు ఒప్పుకుంది. కేసు నమోదు చేసుకుని నిందితురాలని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్‌హరికృష్ణ రెడ్డి తెలిపారు.

పరీక్షలో ఫెయిల్.. విద్యార్థి అదృశ్యం

ఖైరతాబాద్, జూన్ 8 : పరీక్షలో ఫెయిలు కావడంతో ఓ విద్యార్థి కనిపించకుండా పోయాడు. చింతలబస్తీకి చెందిన శివ ప్రకాశ్ శర్మ కుమారుడు భజరంగ్ బాల సంస్కార్ శర్మ సోమాజిగూడలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదివాడు. రెండు సంవత్సరాలుగా ఎకనామిక్స్ పరీక్ష తప్పుతూ వస్తున్నాడు. దీంతో పై చదువుల కోసం ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీలో చేరాడు. కాగా ఈ నెల 7 అఫ్జల్‌గంజ్‌లోని తన స్నేహితుడిని కలిసి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. కొద్ది సేపటికి తన తండ్రికి ఫోన్ చేసి తాను డిగ్రీలో సైతం ఓ సబ్జెక్టు తప్పానని చెప్పాడు. కాల్ మాట్లాడుతుండగానే కట్ చేశాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన బాల సంస్కార్ శర్మ తిరిగి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

మలక్ పేట, జూన్ 8: విక్రాంత్ బ్యాడ్మింటన్ అకాడమీలో నాలుగు రోజులపాటు జరిగిన రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ జూనియర్, సబ్ జూనియర్, మెన్, ఉమెన్, వెటరన్– 2025 పోటీలు ఆదివారం ముగిశాయి. వెయ్యి మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ చాంపియన్ షిప్‌లో బాల, బాలికల పోటీల్లో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అంతర్జాతీయ మాజీ క్రీడాకారిణి, గోపీచంద్ అకాడమీ కోచ్ దీప్తి రెడ్డి, మాజీ అంతర్జాతీయ క్రీడాకారుడు గురుసాయి దత్త, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ఆనంద్ బాబు, కార్యదర్శి కరెడ్ల శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి సాయి రెడ్డి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సంయుక్త కార్యదర్శి యూవీఎన్ బాబు, మీడియా ఇన్‌చార్జి రమణారెడ్డి, సామ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

■ ట్రేడింగ్ పేరుతో రూ. 1.44 కోట్ల టోకరా
■ ఛార్జింగ్ స్టేషన్‌పేరిట రూ. 29 లక్షలు బురిడీ

సైబర్ మోసం..

సిటీబ్యూరో, జూన్ 8(నమస్తే తెలంగాణ): ట్రేడింగ్‌లో మంచి లాభాలొస్తాయంటూ నమ్మించి సైబర్‌నేరగాళ్లు ఒక ప్రైవేట్ ఉద్యోగి వద్ద నుంచి రూ. 1.44 కోట్లు కొట్టేశారు. వివరాల్లోకి వెళితే...హస్తినాపురానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగికి గత నెల 9వ తేదీన సచితారెడ్డి అనే యువతి వాట్సాప్‌లో కాంటాక్ట అయ్యింది. తాను మార్కెట్ యాక్సెస్ కంపెనీలో పనిచేస్తున్నానని, ట్రేడింగ్ చేస్తున్నానని, నా వాలెట్లో భారీగా డబ్బు ఉంది, మీరు ట్రేడింగ్ చేసి డబ్బు సంపాదించుకునేందుకు ఇదే అవకాశమంటూ మాట్లాడింది. నమ్మిన బాధితుడు మొదట రూ. 50 వేలు పెట్టుబడిగా పెట్టాడు. ఒక్క రోజులోనే రూ. 8 వేల లాభం వచ్చింది. ఆ డబ్బును బాధితుడి ఖాతాలోకి డిపాజిట్ చేశారు. నేరగాళ్లు చెప్పినట్లు యాప్‌డౌన్‌లోడ్ చేసి అందులో అకౌంట్ తెరిచాడు, అందులో తనకు ఉన్న వ్యాలెట్‌లో తనకు వచ్చిన రూ. 8 వేల లాభాన్ని తిరిగి పెట్టుబడిగా పెట్టాడు. అయితే అవి విత్‌డ్రా చేసుకునే అవకాశం లేకుండా పోయింది. దీనిపై కస్టమర్ కేర్‌కు ఫోన్ చేస్తే మీరు రూ. 8 వేల డ్రా చేస్తే మీ వ్యాలెట్ డ్యామేజ్ అవుతుందని, ప్రొఫైల్ డెబ్బతిట్టుందంటూ భయపెట్టించారు. మీ వ్యాలెట్‌లో ఎంత డబ్బు ఉంటే అంతా రుణం పొందే అవకాశాలు ముమ్ముందు వస్తాయని దానిని దృష్టిలో పెట్టుకొని ట్రేడింగ్ చేయాలంటూ సూచనలు చేశారు. మే 6వ తేదీ నుంచి జూన్ 6 వరకు దఫ దఫాలుగా రూ. 1,44,20,000 కోట్లు బాధితుడు పెట్టుబడిగా పెట్టాడు. మీకు ఆమెరికా డాలర్లు అప్పుగా ఇప్పిస్తామంటూ నమ్మిస్తూ బాధితుడి ఖాతాలో నకిలీ షేర్లు ట్రాన్స్‌ఫర్ చేసి బాధితుడి వద్ద నుంచి డబ్బు వసూలు చేశారు. అయితే తన డబ్బే వ్యాలెట్‌లో ఉన్నా దానిని విత్ డ్రా చేసుకునే అవకాశం లేకపోవడంతో పాటు ఇంకా పెట్టుబడి పెట్టాలని నేరగాళ్లు కోరుతుండడంతో అనుమానం వచ్చి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

సైబర్ వలలో వైద్యురాలు

సిటీబ్యూరో, జూన్ 6 (నమస